చెట్ల కొమ్మల తొలగింపు

అంబర్‌పేట: ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని శంకర్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించే పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లో చెట్ల కొమ్మలతో వీధిలైట్లు, విద్యుత్ సరఫరాలకు అంతరాయం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అలాగే స్థానికంగా ఆమె పర్యటించి స్థానికులను వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని ఆమె సూచించారు.

నియామకం

చిక్కడపల్లి: ఆర్‌పీఐ–ఏ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రఘుముద్రి పీటర్ నాయుడు నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్, మహిళా అధ్యక్షురాలు స్నేహలత ఆయనకు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. వచ్చేది అంబేడ్కర్ రాజ్యమని ఆర్‌పీఐ–ఏ పార్టీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న 'ప్రవిష్ట-2025'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ పీజీ కళాశాలల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రవిష్ట–2025 సదస్సు ఆకట్టుకున్నది. ముఖ్య అతిథిగా పద్మశ్రీ డాక్టర్ టి. హనుమాన్ చౌదరి హాజరై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు పాటుపడాలన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో నిలబడలంటే అంకిత భావంతో చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ప్రముఖ విద్యావేత్తలు సుమియా అజీజ్, శోభా సిస్టర్ , అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియంక, అధ్యక్షుడు ఎం. జ్ఞానేశ్వరి, డైరెక్టర్ శ్రావణ్ కుమార్, పాల్గొన్నారు.

మహిళలకు అధిక ప్రాధాన్యం

చిక్కడపల్లి: భారతీయ సంస్కృతిలో మహిళకు ఇచ్చిన ప్రాధాన్యత ప్రపంచంలో మారెక్కడ లేదని ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'విజయంలో భార్య భర్తల భాగస్వామ్యం' పేరిట త్యాగరాయ గానసభలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన దంపతులకు పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భార్య భర్త ఆదర్శంగా సంసారాన్ని సాగించినప్పుడే ఆదర్శవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు గంగోత్రి నిలయం చైర్మన్ జి.హనుమంతరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, లంకా లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌గుప్తా పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి: స్వరలహరి యూఎస్‌ఏ, ఆనంద భైరవి ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. శ్రీరామ్ దుర్వాసుల, శారదాసాయిల నిర్వహణలో గాయనీ గాయకులు పాల్గొని తెలుగు, హిందీ గీతాలను ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్ నంగునూరి హాజరై సినీ నేపథ్య గాయనీ గీతామాధురితో పాటు ఇతర గాయనీ గాయకులను అభినందించి సన్మానించారు.

పైపులైన్ ఆధునీకరణకు కృషి

అంబర్‌పేట: నియోజకవర్గంలో పైపులైన్ వ్యవస్థ ఆధునీకరణకు దశల వారీగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్‌నగర్‌లో రూ.4 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా రోడ్డుపై స్పీడ్‌బ్రెకర్లు వేయాలని, తరచూ డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు

కాచిగూడ: ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలోని సాయి అప్నా మోటార్ డ్రైవింగ్ స్కూల్ యజమాని పెంట రమేష్ తన వద్దకు డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ లైంగికంగా వేధించాడు. దీంతో ఆ మహిళ బుధవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదు మేరకు పెంట రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలి

పాత చట్టాలనే అమలు చేయాలని డిమాండ్
- సమర నినాదాన్ని మోగించిన కార్మికవర్గం
- బహుజన, వామపక్ష, కార్మిక సంఘాల నిరసన ప్రదర్శన
- సంఘీభావం తెలియజేసిన తెలంగాణ మహిళా, సినిమా వేదికలు, సర్పంచుల సంఘం



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ప్రదర్శనలో బహుజన, వామపక్ష కార్మిక సంఘాల నేతలు చంద్రన్న ప్రసాద్,షేక్‌షావలీ, అనిల్, రాజేష్, ప్రఫూల్ రామిరెడ్డి

చిక్కడపల్లి: దేశానికి, దేశ ప్రజలకు, కార్మికవర్గానికి ఉపయోగపడే 44 కార్మిక చట్టాల స్థానంలో కార్మిక చట్టాల సవరణల పేరిట కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ప్రమాదకరమైన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని బహుజన వామపక్ష కార్మిక సంఘాలు డిమాండ్ చేసింది. బహుజన, వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి టీయూజేఏసీ కేంద్ర కార్యాలయం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు కార్మిక ప్రదర్శన, ధర్నా పెద్ద ఎత్తున నిర్వహించారు.

☛ బహుజన వామపక్ష జేఏసీ, టీబీఎస్‌సీకేయూ చర్చల నేత చంద్రన్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేత షేక్‌షావలీ, ఏఐఎఫ్‌టీయూ నేత వై.మల్లేష్, ఏఐసీటీయూ రాజేష్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ ప్రజావ్యతిరేక విధానాల పట్ల తీవ్రంగా మండిపడ్డారు. 4 లేబర్ కోడ్‌లను ఎత్తివేసి పాత చట్టాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనికి సమానవేతనం, పనిగంటల పెంపును రద్దు చేయాలని నినదించారు.

☛ కార్మికులకు ఉద్యోగ భద్రతలో భాగంగా పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలన్నారు. గని, బీడి కార్మిక చట్టాల పరిరక్షణ, కనీస వేతనం రూ.26 వేలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా, కార్మిక ప్రభుత్వాలపై రైతు వ్యతిరేక విధానాలపై పాడిన పోరాట పాటలు ఆలోచింపజేశాయి.

☛ ఈ ధర్నాలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నేత తుమ్మల ప్రఫూల్ రాంరెడ్డి, సర్పంచుల సంఘం నేత మంచాల వెంకటస్వామి, తెలంగాణ మహిళా ఉద్యమకారుల వేదిక నేతలు బాకారం లావణ్య, సుజి, సుచరిత, ఆడజన సమాఖ్య నేత ధనలక్ష్మి, తెలంగాణ సినిమా వేదిక లారా, సాయిలు, భిక్షపతి, రఘు, కన్నలక్ష్మి, బైరిగోదావరి, కళాకారులు ఖాసీం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్– హెచ్‌యూజే సంఘీభావం

హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల రద్దుకి నిరసనగా కార్మిక సంఘాల దేశ వ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలిపారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించి మద్దతు తెలిపారు. హెచ్‌యూజే అధ్యక్షుడు బి.అరుణ్కుమార్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు పి.ఆనందం, బి.రాజశేఖర్, కార్యదర్శులు ఇ.చంద్రశేఖర్, సలీమా, గండ్ర నవీన్, హెచ్యూజే కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు నాగమణి, మధుకర్, విజయ, మాధవ రెడ్డి, వీరేశ్, వెంకట స్వామి, సీనియర్ జర్నలిస్టులు రత్నాకర్, భాస్కర్, శశికళ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక సంఘాల దేశ వ్యాప్త సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్- హెచ్‌యూజే ప్రతినిధులు

నల్ల చట్టాల అమలును నిలిపేయాలి

ఫీవర్ ఆస్పత్రిలో కార్మికుల నిరసన

నల్లకుంట: కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కోడ్ల (నల్ల చట్టాలు) అమలును వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాలు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టాయి. దీనికి మద్దతుగా బుధవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) యూనిట్ ఆధ్వర్యంలో ఉదయం హాజరు సమయానికి ముందు ఓ అరగంట పాటు నిరసన ధర్నా చేపట్టారు.

☛ ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడతూ.. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు కాడ్‌ల కారణంగా కార్మిక వర్గం హక్కులు ప్రమాదంలో పడతాయన్నారు. ఈ చట్టాల ప్రకారం కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేయడానికి అనేక ఆటంకాలు ఏర్పడతాయని చెప్పారు. అలాగే 100 మంది కంటే తక్కువ మంది కార్మికులు పనిచేస్తున్న సంస్థల నుంచి వారిని తొలగించడం యాజమాన్యాలకు సులభం అవుతుందని చెప్పారు. ముఖ్యంగా నాలుగో కోడ్ అమలు ద్వారా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ రక్షణ లేకుండా పోతోందని తెలిపారు.

☛ కార్మిక వ్యతిరేక కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఈ సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు రుద్రమ్మ, కార్యదర్శి జి. సర్వేశ్వర్ రావు, ఖమారుద్దీన్, కోశాధికారి సయ్యద్ అలీమ్, సహాయ కార్యదర్శులు నాసిర్ ఖాన్, సరస్వతి, యూసఫ్, మనీషా తదితరులు పాల్గొన్నారు.



ఫీవర్ ఆస్పత్రి గేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఆస్పత్రి టీఎంసీఈడబ్ల్యూ యూనియన్ యూనిట్ సభ్యులు

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

కాచిగూడ: నింబోలిఅడ్డ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను స్థానికులు కార్పొరేటర్ ఉమారాణి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ బుధవారం జలమండలి సిబ్బందిని పిలిపించి డ్రైనేజ్ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 42 శాతం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు సుగూరి దుర్గయ్యగౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రకటించాకే ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇచ్చి రెండు వారాలైనా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. జీఓ పేరుతో కాలయాపన చేస్తూ స్థానిక సంస్థల రిజర్వేషన్లను నిర్వీర్యం చేసే కుట్రలను సహించబోమని వారు హెచ్చరించారు. తక్షణమే బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు రిజర్వేషన్లు ప్రకటించకపోతే రాజీనామా చేయాలన్నారు.

☛ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ సంఘాలు, అఖిల పక్షాలను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రితో చర్చించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలలోపు బీసీ రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని నెలలోపు హైకోర్టును గడువు కోరిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ చేపట్టారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ సభ్యులు బీసీ రిజర్వేషన్లపై పోరాటం చేయాలని వారు కోరారు. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 7వ షెడ్యూల్ లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సమన్వయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్‌గౌడ్, బీసీ జన సైన్యం అధ్యక్షుడు సింగం నాగేశ్వర్ గౌడ్, బీసీ రచయిత వేదిక అధ్యక్షుడు భైరు శేఖర్, ఎంబీసీ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లిలో జరిగిన సదస్సులో అభివాదం చేస్తున్న గౌడ సంఘాల నాయకులు

నేడు గురుపౌర్ణమి పూజలు

ముషీరాబాద్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ముషీరాబాద్‌లో గురువారం ఉదయం 10గంటలకు సద్గురు సాయినాథునిడి ప్రత్యేక పూజలు ఉంటాయని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి. శ్రీధర్‌చారి తెలిపారు. గురుపౌర్ణమి వేడుకలకు హాజరుకావాలని బుధవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహంకాళి దేవాలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, వివిధ పార్టీల నేతలు హాజరవుతారని తెలిపారు.


విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి



అంబర్‌పేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అకడమిక్ హైట్స్ కేంబ్రిడ్జ్ పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల కేబినెట్ ఎంపిక, సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేబినెట్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించి వారికి బ్యాడ్జీలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతభను ప్రోత్సహించేందుకు తమ పాఠశాలలో చొరవ తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యామిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల సంఘాల భవన నిర్మాణాల్లో వేగం పెంచుతాం

అంబర్‌పేట: ఉప్పల్‌భగాయత్‌లో నిర్మిస్తున్న వంజర సంఘం భవన్ని మూడు నెలల్లో ప్రారంభించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నట్లు వంజర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేష్ తెలిపారు. బుధవారం గోల్నాకలో ఏర్పాట్లు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన స్థలం భవన నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే కుల సంఘానికి యాదగిరిగుట్ట, శ్రీశైలం, వేములవాడ వంటి పుణ్యక్షేత్రాల్లో వంజరి కుల భవనాలను నిర్మించేందుకు సంఘం చొరవ తీసుకుంటుందన్నారు. కుల సంఘం మరింత పటిష్టం చేసేందుకు తాము చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, సలహాదారులు పాల్వేరు ముత్తయ్య, కాలేరు సురేందర్, కాలేరు రామోజీ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి విక్రేత రిమాండ్

1120 గ్రాముల గంజాయి స్వాధీనం

నల్లకుంట: నిషేధిత మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ రిమాండ్‌కు తరలించిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు.. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం న్యూనల్లకుంట లింగాలగడ్డ పార్కు వద్ద ఓ గుర్తు తెలియని యువకుడు గంజాయి ప్యాకెట్‌తో అనుమానాస్పదంగా కనిపించాడు. సమాచారం అందడంతో ఎస్సై లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో వెల్డింగ్ పనులు చేస్తూ మల్కాజ్‌గిరి ఓల్డ్ సఫిల్‌గూడ షఫీనగర్‌లో నివాసముండే నజీర్ బేగ్(22) అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. గంజాయి పెడ్లర్లు షేక్ సమీర్, సయ్యద్ సోయబ్‌లకు గంజాయి విక్రయించేందుకు సఫిల్‌గూడ నుంచి ఆర్టీసీ బస్సులో తీసుకొచ్చినట్లు అంగీకరించాడు. అతని వద్ద 1120 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇద్దరు గంజాయి పెడ్లర్లు తప్పించుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి నజీర్ బేగ్‌ను బుధవారం నాంపల్లి మెట్రోపాలిటిన్ కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

రూ.15లక్షలతో కళాధర్‌నగర్ పార్కు అభివృద్ధి

ముషీరాబాద్: డివిజన్ కళాధర్‌నగర్‌లో గల జీహెచ్ఎంసీ పార్కును రూ. 15లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకాంత్ చుట్టామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. బుధవారం కళాధర్‌నగర్ పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, జీహెచ్ఎంసీ ఏఈ మురళీ, జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్కులో పనులకు నిధులు వెచ్చిస్తున్నామని అన్నారు. కొంత మంది జీహెచ్ఎంసీ పార్కులను తమ ఆధీనంలో ఉంచుకుని ఆదిపత్యం చెలాయించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ పార్కులు ఎవరి సొంతం కాదని ప్రజల అందరిదని, పార్కులను తమ ఇంటి వలే కాపాడుకోవాలని సూచించారు.

☛ పార్కులను సామాజిక బాధ్యతతో అభివృద్ధికి వాటి నిర్వాహనకు సహకరించాలన్నారు. నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పార్కులను సైతం ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పరుస్తూ ప్రజలకు అహ్లాదకర వాతావరణం అందించేందుకు కృషిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, టి. తలారి శ్రీకాంత్ ముదిరాజ్, పూసగోరక్‌నాథ్, డి. శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్, డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎయిర్‌టెల్ రాజు, వంగాల నర్సింగ్‌రావు, బిజ్జి రావస్, నర్సింగ్ ముదిరాజ్, సందీప్, ముచ్చుకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి..

సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రైవేటు వైద్య సంస్థలు పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి మెరుగైన వైద్యం అందించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ పార్శిగుట్ట వద్ద గల ప్రేయర్ పవర్ చర్చ్‌లో చర్చ్ వ్యవస్థాపక సభ్యురాలు ఎస్తేర్ రాణి వర్ధంతి సందర్భంగా కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రేయర్‌పవర్ చర్చ్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌దీపక్, ఆలిండియా ప్రేయర్‌పవర్ చర్చ్ డైరెక్టర్ వ్యామ్ అబ్రహాం, కార్యదర్శి బ్రబహం, క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సాల్మూన్‌రాజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం





కల్యాణం చేస్తున్న అరెల్లి అంజయ్య

కాచిగూడ: పసుపు కుంకుమల సంగమాన్ని తలపించిన వీధులు.. వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. బాజాభజంత్రీల నడుమ శివసత్తుల నృత్యాలతో చాదర్‌ఘాట్ రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బుధవారం అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కలశ స్థాపన, పుట్ట బంగారం, గంగతెప్పతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మతల్లిని రంగురంగుల పూలమాలలతో అలంకరించారు. ఒగ్గు కళాకారులు ఎల్లమ్మ కథ చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆరెల్లి అంజయ్య దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మవారి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు సాయి గాయత్రి హోమం..

ఉదయం 5గంటలకు నగర సంకీర్తనతో గురుపౌర్ణమి వేడుక ప్రారంభమవుతుందని సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనము, మండపారాధన, ఏకాదశ కలశ స్థాపనాపూర్వక అభిషేకం, గాయత్రి హోమం – పూర్ణాహుతి, ఆశీర్వచనం ఉంటుందన్నారు. అనంతరం సాయిబాబాకు కలశోధకాలతో అభిషేకం ఉంటుందని తెలిపారు.

సాయిబాబాకు లక్ష పుష్పార్చన

నల్లకుంట: బాగ్అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం భక్తులతో పోటెత్తింది. బుధవారం ఉదయం సాయిబాబాకు లక్ష పుష్పార్చనలు చేశారు. ఉదయం కాకడ హారతి అనంతరం సుమారు 700 మందికి పైగా పేదలకు అన్నదానం చేశారు.

వేదపండితులకు సన్మానం

సాయంత్రం ధూప్ హారతి అనంతరం గురు సత్కారం (వేదపండితులకు సన్మానం), పల్లకీ సేవ, భజన ఉంటాయన్నారు. ఊయల సేవ- శేజ్ హారతితో గురు పౌర్ణమి మహోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. కలశ పూజకు అవసరమైన పూజ సామగ్రిని భక్తులే సమకూర్చుకోవాలని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు.



సాయిబాబాకు పుష్పార్చన చేస్తున్న అర్చకులు



పూజలో భక్తులు, టీబీఎస్ఎస్ ప్రతినిధులు

కనుల పండువగా శాకాంబరి ఉత్సవాలు

నల్లకుంట: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని బుధవారం ఆర్కేపురం అల్కాపురిలోని అభయాంజనేయస్వామి, దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామికి ఆకు పూజలు చేశారు. శాకాంబరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పూజలో టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షులు కానాల శ్యామసుందర్ రావు, ఊరే ప్రసాద్ రావు, హరిహర రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం, దేవులపల్లి అశోక్ కుమార్, గూడ జయరామ్, గూడ రాజేశ్వర రావు, దేవులపల్లి బాలచంద్రశర్మ, నరసింహారావు, దేవులపల్లి బాలచంద్రశర్మ, గంపా రామశర్మ, సర్వరఘు, నాగపరాజు రజిని, శశాంక్ మోహన్, మాల్యాల వెంకటేశ్వర రావు, టీబీఎస్ఎస్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.